

నేటి నుంచి ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్

శ్రీకాకుళం సిటీ : ఈనెల 7వ తేదీ నుంచి ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ నిర్వహణకు ఉన్నత విద్యా మండలి, సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసినట్లు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్‌లైన్‌లో కౌన్సెలింగ్ ఉంటుందని, స్థానిక కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమస్యలు ఉన్న విద్యార్థులు సంప్రదించాలని సూచించారు. 7 నుంచి 18వ తేదీ వరకు రిజిస్ట్రేషన్, 10 నుంచి 18 మధ్య వెబ్ ఆప్షన్ల నమోదు, 19న ఆప్షన్ల మార్పు, 22వ తేదీన సీట్లు కేటాయింపు ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సీట్లు లభించిన విద్యార్థులు 23 నుంచి 26 మధ్య సెల్ఫ్ రిపోర్టు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎపిఇఎపి సెట్-2025 ఎంపిసి స్ట్రీమ్ ఉత్తీర్ణత సాధించిన వారు కౌన్సెలింగ్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విఆర్‌ఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

విఆర్‌ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందిగీకి సాహెబ్



మాట్లాడుతున్న విఆర్‌ఎ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందిగీకి సాహెబ్

ప్రజాశక్తి - ఆమదాలవలస

విఆర్‌ఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలను అమలు చేయాలని విఆర్‌ఎ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ బందిగీకి సాహెబ్, ఎం.అప్పలనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో విఆర్‌ఎల సంఘం జిల్లా ఏడో మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్ట్ టైం పేరుతో విఆర్‌ఎలతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటోందని విమర్శించారు. ఫుల్ టైమ్ విధులు నిర్వహిస్తున్నా, కనీస గుర్తింపు లేదన్నారు. తెలంగాణలో విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ఉద్యోగ, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9వ తేదీన నిర్వహించే అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. విఆర్‌ఎల సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 46 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి హక్కులను హరిస్తోందని విమర్శించారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను పారాటాలతోనే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సంఘ రాష్ట్ర కోశాధికారి కె.రవికుమార్, సహాయ కార్యదర్శి షేక్ రెహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రమణమూర్తి మాట్లాడుతూ నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలని, రాత్రి డ్యూటీలు రద్దు చేయాలని, డిఎతో కూడిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సమావేశ అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా అల్లు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులుగా టి.త్రినాథరావు, ఉపాధ్యక్షులుగా బి.ఎన్ సీతప్పడు, బి.లక్ష్మీనారాయణ, బి.రాములమ్మ, ఎస్.అప్పలస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె.రమణమూర్తి, సహాయ కార్యదర్శులుగా కె.ఈశ్వరరావు, జి.అప్పారావు, కె రామారావు, కోశాధికారిగా డి.అప్పారావుతో పాటు 26 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పోతయ్య, వెంకటరమణ, సింహాచలం, మీనాక్షి, సుశీల, రాజులమ్మ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మోసాలకు కేరాఫ్ చంద్రబాబు

వైసిపి జిల్లా పరిశీలకులు కె.రవిబాబు



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

ప్రజాశక్తి - కవిటి

మోసాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని వైసిపి జిల్లా పరిశీలకులు కుంభా రవిబాబు విమర్శించారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్నిస్థానిక ఒక సంఘ భవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలు ఇచ్చిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాట తప్పి ప్రజలను మోసం చేశారని, వాటిని గ్రామస్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. వైసిపి శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం మాట్లాడుతూ జగన్ పథకాలను కాపీ కొట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయడంలో మాత్రం ప్రజలను వంచించారని చెప్పారు. చంద్రబాబు, లోకేష్ జిల్లాకు అనేక హామీలు ఇచ్చారని వాటిని అమలు చేయలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై అడుగుతుంటే డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలు మంజూరు చేసి అందులో ఐదు కాలేజీలు 500 మంది విద్యార్థులతో ప్రారంభించి బడుగు, బలహీన వర్గాలకు వైద్య విద్యను అందుబాటులోకి తెస్తే మిగతా 15 కాలేజీలను ఈ ప్రభుత్వం ప్రైవేటుపరం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ అందరూ సమిష్టిగా పనిచేస్తే భవిష్యత్‌లో మళ్లీ వైసిపిదే అధికారమన్నారు. నియోజకవర్గ నాయకత్వంపై అధినేతదే తుది నిర్ణయమని, ఆయన ఎవరి పేరు సూచిస్తే వారిని ఆదరించాలన్నారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపి ఎప్పుడూ ప్రతిపక్షమేనని, అయినా తమను ఎదిరించే దమ్ము, ధైర్యం ఎవరికీ లేదన్నారు. కంచిలి జెడ్‌పిటిసి సభ్యులు ఇప్పిలి లోలాక్షి, కంచిలి, సోంపేట ఎంపిపిలు పైల దేవదాస్ రెడ్డి, నిమ్మన దాసు అధికార పార్టీ నుంచి తమకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. నియోజకవర్గంలో వైసిపి నాయకత్వంపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. సీడాప్ మాజీ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, ఎంపిపిలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు అందరూ కలిసి సుమారు 230 మంది ఉన్నారని, ఈ సమావేశానికి ఎంత మంది హాజరయ్యారనేది సమీక్షించి భవిష్యత్ కార్యక్రమం రూపొందించాలని సూచించారు. ఇచ్ఛాపురం వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, కవిటి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో మిన్నారావు ఫైల్)

బాకీ చెల్లించలేదని...
యువకుడు దారుణ హత్య

ప్రజాశక్తి - కొత్తూరు

డబ్బుల బాకీ విషయంలో మాటకు మాట పెరిగి యువకుని హత్యకు దారితీసింది. ఈ ఘటనలో మండలంలోని వసప గ్రామానికి చెందిన లుకలాపు మిన్నారావు (19) శనివారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వసపకు చెందిన లుకలాపు బుడ్డు, లక్ష్మి కుమారుడు మిన్నారావు తాపీ పనితో పాటు గోదాములో కళాసీగా పనిచేస్తున్నాడు. మిన్నారావు స్థానిక కెజిబివికి ఎదురుగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను నడుపుతున్న అదే గ్రామానికి చెందిన మలగాన శంకరరావుకు డబ్బులు బాకీ పడి ఉన్నాడు. శనివారం రాత్రి చాట్ తిని వస్తానని ఇంట్లో చెప్పి శంకరరావు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు వెళ్లాడు. తన డబ్బుల బాకీ తీర్చాలని శంకరరావు అడగడంతో తర్వాత ఇస్తానని మిన్నారావు చెప్పాడు. అప్పటికే వారిద్దరూ మద్యం తాగి ఉండడంతో వారి మధ్య మాటకు మాట పెరిగి తోపులాట వరకు వెళ్లింది. ఈక్రమంలో ఆగ్రహోదగ్రుడైన శంకరరావు సుత్తితో మిన్నారావు తలపై బలంగా కొట్టాడు. దీంతో కింద పడిపోయిన మిన్నారావును కత్తితో పీక కోసి రోడ్డు బయటకు ఈడ్చుకొచ్చి అక్కడ పడేశాడు. రాత్రి సమయం కావడంతో అప్పుడు అక్కడ ఎవరూ లేరు. ఆదివారం ఉదయం శంకరరావు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మరోవైపు రోడ్డు పక్కన విగతజీవిగా పడి ఉన్న మిన్నారావును చూసిన వృద్ధురాలు అప్పలమ్మ విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు ఘటనాస్థలానికి చేరుకుని భోరున విలపించారు. సిఐ చింతాడ ప్రసాద్, ఎస్‌ఐ మహమ్మద్ అమీర్ ఆలీ సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. శవ పంచనామా అనంతరం పోస్టమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ ప్రసాద్ తెలిపారు.

రైలు ఢీకొని 17 ఆవులు మృతి



మృతి చెందిన ఆవులు

సంతబొమ్మాళి : పాతపట్నం మండలంలోని హరిద్వారం రైల్వే ట్రాక్‌పై ఆదివారం రైలు ఢీకొని అదే గ్రామానికి చెందిన లుకలాపు ఆదినారాయణకు సంబంధించిన తొమ్మిది, బసుదొర సోములు చెందిన రెండు, బొమ్మాళి అప్పలరాజు, గుగ్గి నిమ్మయ్య, కలగ రమేష్, బోడసింగి గిరి, లుకలపు భైరాగి, వట్టికూల సింహాచలంకు సంబంధించిన ఒక్కొక్క ఆవు మృతి చెందాయి. పాడిపశువులు మందగా రైల్వే ట్రాక్‌పై మేస్తున్నాయి. ఈ సమయంలో పూరీ-గుణుపూర్ స్పెషల్ రైలు వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 17 పాడి పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి. సమాచారం అందుకున్న ఘటనస్థలికి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి పశువులు చెల్లాచెదురుగా ఉండడం, ప్రాణాలు కోల్పోయి ఉండడం గమనించారు. ఈ సంఘటనలో 8 మంది పాడి రైతులకు సంబంధించిన 17 పాడి పశువులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతి చెందిన పాడి పశువులకు పశు బీమా చేయనందున, ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై శాసనసభ్యులు మామిడి గోవిందరావు కూడా సహాయ సంచాలకులతో మాట్లాడారు. వివరాలు తెలుసుకొని నివేదికను కలెక్టర్‌కు పంపించాలని ఆదేశించారు. పరిశీలనలో టిడిపి నాయకులు బుద్దాల నరేష్, గ్రామస్తులు పశు వైద్య సహాయకులు ఎల్.మోహన్, శ్యాంసుందరరావు, సంచార పశు వైద్య సేవల సిబ్బంది మోహన్, డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి

- అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలి
- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబిరాణి



సమావేశంలో మాట్లాడుతున్న బేబిరాణి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి డిమాండ్ చేశారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన యూనియన్ జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్వాడీలకు 2019 నుంచి వేతనాలు పెరగలేదని, 42 రోజుల సమ్మె సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని రాతపూర్వక హామీని కూటమి ప్రభుత్వం నేటికీ అమలు చేయలేదన్నారు. అంగన్వాడీలకు తల్లికి వందనం, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టిందని గుర్తుచేశారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సర్క్యులర్ ఉన్నా అమలు చేయడం లేదని విమర్శించారు. అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఇకెవైసి నమోదు, లబ్ధిదారులకు ఓటిపి వల్ల అంగన్వా డీలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెంటర్ నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెల్‌ఫోన్లు పనిచేయడం లేదని, నెట్ రాని చోట కూడా ఎఫ్ఆర్ఎస్ అమలు చేయాలని వేధిస్తున్నారని చెప్పారు. అంగన్వాడీలపై అధికార పార్టీ నేతలు రాజకీయ వేధింపులకు పాల్పడుతూ తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ వేధింపులు ఆపాలని, తొలగించిన అంగన్వాడీలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే దశల వారీగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 9న చేపడుతున్న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ, నాయకులు పి.లతాదేవి, కె.సుజాత, జె.కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తర డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల, స్కూల్ స్వీపర్స్ యూనియన్ల సమావేశం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే వారిని కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బియ్యం, గుడ్లు ఇచ్చి ప్రస్తుత టీ ఖరీదు కూడా ఇవ్వకుండా పిల్లలకు పౌష్టికాహారం పెట్టాలంటే ఏవిధంగా సాధ్యమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మెనూ ఛార్జీలు ఒక్కో విద్యార్థికి కనీసం రూ.20 ఇవ్వాలని కోరారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. పది నెలలకు వేతనాలు చెల్లిస్తున్నారని, 12 నెలలకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కూల్ శానిటేషన్ వర్కర్స్‌కు కనీస వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. గ్లౌజులు, మాస్కులు ఇవ్వాలని కోరారు. వేసవి సెలవుల్లో పనిచేసినందుకు సగం వేతనం కాకుండా పూర్తి వేతనం ఇవ్వాలన్నారు. ఈనెల తొమ్మిదో తేదీన చేపడుతున్న అఖిల భారత సమ్మెలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, స్కూల్ స్వీపర్స్ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ నాయకులు వి.లక్ష్మి, కె.కౌసల్య, పి.జమ్మల, టి.సీతమ్మ, ఎ.రాధ, పి.లక్ష్మి, టి.ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

జూనోటిక్ వ్యాధులపై అవగాహన అవసరం

పశుసంవర్ధకశాఖ జెడి కె.రాజగోపాలరావు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు

శ్రీకాకుళం సిటీ: పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జూనోటిక్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కంచరాన రాజగోపాలరావు అన్నారు. నగరంలోని వెటర్నరీ పోలీక్లినిక్ ఆవరణలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవంలో భాగంగా 602 పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ టీకాలను ఆదివారం వేశారు. పెంపుడు జంతువుల యజమానులకు జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల్లో రేబిస్, మెదడువాపు, బర్డ్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ, ఆంత్రాక్స్, లెప్టోస్పైరాసిస్, బ్రూసెల్లోసిస్ ముఖ్యమైనవని, వీటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పెంపుడు జంతువులకు వ్యాక్సిన్లు తప్పనిసరిగా వేయించాలన్నారు. జూనోటిక్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బహుళార్థక పశువైద్యశాల ఉప సంచాలకులు బి.గణపతిరావు పెంపుడు జంతువుల యజమానులు పాటించాల్సిన పద్ధతులను, జిల్లా పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం వైద్యులు వై.వి కృష్ణారావు పెంపుడు జంతువులకు చేయాల్సిన టీకాలను వివరించారు. అనంతరం జూనోటిక్ వ్యాధులపై అవగాహనా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ హేమంత్ కుమార్, పారావెటర్నరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల ఏడో తేదీన నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుదారులు అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు, వాటి స్థితికి సంబంధించిన సమాచారం గురించి తెలుసుకోవడానికి 1100కి నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు
క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలో కొత్త రోడ్ సమీపంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ 15 చదరంగం ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో డొంకాడ కార్తికేయ ప్రథమ స్థానం, బొల్ల యశ్వంత్ ద్వితీయ స్థానం, ఎస్.కె.పి.నిహాల్ మూడవ స్థానం, పొన్నాడ వేదిష్ నాలుగవ స్థానం సాధించి బాలుర విభాగంలో రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపికయ్యారు. మెట్ట తీక్షణ, బొల్ల శృతి, జామి వినమ్ర, రిత్విక వరుస స్థానాల్లో నిలచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరంతా ఈ నెల 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్ 15 చదరంగం ఛాంపియన్ షిప్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని ఆల్ ఇండియా చెస్ఇన్ స్కూల్స్ కమిటీ సభ్యులు సనపల భీమారావు తెలిపారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు బగాది కిషోర్, కార్యదర్శి జామి రమేష్, సంయుక్త కార్యదర్శి వై.ఎస్.వి.కుమార్, కోచ్ అభినవ్ అసోసియేషన్ సభ్యులు వసంతరావు మాస్టారు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న రైతులు

న్యాయం చేయాలి

ప్రజాశక్తి- సోంపేట

ఏళ్ల తరబడి వారసత్వంగా వస్తున్న భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కొర్లాంఅగ్రహారం రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు ఆదివారం బాధిత రైతులంతా గ్రామ సచివాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తాతల కాలం నుంచి అగ్రహారం భూములు కొనుగోలు చేసి, సిస్తులు కట్టి, పంట సాగు చేసుకుంటున్నామని తెలిపారు. అధికారులు భూస్వాములకు కొమ్ముకాస్తూ... నిరుపేద రైతుల భూములను వారికి కట్టబెట్టేందుకు ప్రయత్నించడం సమంజసం కాదన్నారు. మండలస్థాయి నుంచి కలెక్టర్, మంత్రుల వరకు విన్నపాలు చేశామని, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయకపోతే థర్మల్ ఉద్యమం లాంటి మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. తాము న్యాయం కోసం పోరాటం చేస్తుంటే మరోవైపు అధికారులు ఈ భూములను వేరొకరికి విక్రయించేందుకు సహకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రహారం భూములపై తమది వారసత్వపు హక్కు అని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు

సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి- బూర్జ

ప్రతి ఉద్యోగికి చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని కొల్లివలస అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దేవేందర్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా దుశ్శాలువతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవేందర్ ప్రిన్సిపాల్‌గా మంచి సేవలు అందించి అంకితభావంతో పనిచేస్తూ వేలాది మంది విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్ది ఉన్నత స్థానంలో నిలిపారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గురుకులాల జాయింట్ సెక్రెటరీ సంజీవరావు మాట్లాడుతూ దేవేందర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎవింఒ బివి మల్లేశ్వరరావు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం డిసిఒలు గ్రేస్, రూపవతి, ఎన్.రామకృష్ణ, విశ్రాంత బిసిఒలు బాలాజీ నాయక్, చంద్రావతి, చంద్రశేఖర్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



నినదిస్తున్న నాయకులు

దళితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలో ఉన్న దళితుల సమస్యలు, ముఖ్యంగా భూసమస్యలు పరిష్కరించాలని నాయకులు దుక్క ఆదినారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎపి దళిత మహాసభ కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షులు టొంపల సూరప్పడు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని పలు దళితుల సమస్యలు, భూసమస్యలపై చర్చించి, సంఘం భవిష్యత్ కార్యక్రమాలపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులందరూ సంఘటితంగా ఉండి సమస్యలు పరిష్కారం చేసుకోవాలన్నారు. సమావేశంలో గౌరవ అధ్యక్షులు సాకేటి పోతయ్య, జిల్లా ఉపాధ్యక్షులు దత్తి గోవింద, సీనియర్ నాయకులు పల్ల నీలయ్య, దుక్క ఆదినారాయణ, మండల కోశాధికారి నేతల పెంటయ్య, మండల కార్యదర్శి సోమాధుల రమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి లండ చిన్నబాబు, మీడియా కన్వీనర్ ముక్కు రాము, జాయింట్ కార్యదర్శి కోండ్రు రాంబాబు, లావేరు మండల కన్వీనర్ గంట్లాన మారేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

చైతన్య సదస్సు, ర్యాలీ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు లోపింటి నరసింహమూర్తి కోరారు. పట్టణ ఎస్ఐ ముకుందరావును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలు, మైనర్ డ్రైవింగ్, ఒకే వాహనంలో ఇద్దరికంటే ఎక్కువ మంది ప్రయాణించడం వంటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మితిమీరిన వేగంగా ప్రయాణించడం, వాహనాల ధ్వని, వాయు కాలుష్యాలు, ఈవ్ టీజింగ్ ఇతర సమస్యల నివారణకు కృషి చేయాలని అభ్యర్థించారు. తమవంతుగా ఆయా కార్యక్రమాల్లో పాల్గొని తోడ్పాటు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు జి.ఉమాశంకర్, సభ్యులు బుజ్జి, యోగి, ఎల్.వెంకటరావు, బాలకృష్ణ, బబ్బుల, రఘు, వై.బాల, పిఆర్ఒ డి.గోపి, కాళ్ల నరసింహ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

అమ్మో నౌపడా?

బదిలీపై రావడానికి ఉద్యోగులు వెనుకంజ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

'నౌపడ పంచాయతీనా మాకు వద్దు, కాక వద్దు. మేము అక్కడ పని చేయలేం వేరే చోట పనిచేసుకుంటాం. అవసరమైతే కొంచెం దూరమైనా బదిలీ అయిపోతాం. అంతేకానీ అక్కడ పని చేయలేం' ఇదీ సంతబొమ్మాళి మండలంలో కస్పానౌపడ పేరుతో రికార్డుల్లో ఉన్న నౌపడ మేజర్ పంచాయతీపై కొంతమంది ఉద్యోగుల్లో ఉన్న అభిప్రాయం. ఇటీవల సచివాలయ సిబ్బంది బదిలీల్లో భాగంగా ఎక్కువమంది సిబ్బంది మాట్లాడుకుంటున్న మాటలు. సుదీర్ఘ అనుభవం ఉన్న అధికారుల సైతం ఇక్కడ పనిచేయడానికి విముఖత చూపిస్తున్నారు. ఇది మేజర్ పంచాయతీ కావడంతో పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు గ్రేడ్ వన్ అధికారులు విధులు నిర్వహించాల్సి ఉంది. అలాగే ఇక్కడ ఉన్న రెండు సచివాలయల్లో సుమారు 20 మంది సిబ్బంది పని చేయాల్సి ఉంది. వీరిలో ముగ్గురు మినహా దాదాపు అందరూ బదిలీ కావడంతో ఈ స్థానాలు భర్తీ చేసేందుకు అధికారులకు తలకు మించిన భారమవుతుంది. ఏ పంచాయతీ కార్యదర్శిని అడిగినా, విఆర్‌ఒని అడిగినా, ఏ ఉద్యోగిని ప్రశ్నించినా మేము చేయలేమని సమాధానం ఇస్తున్నారు. దీనికి ప్రధాన కారణం ఇది మేజర్ పంచాయతీ ఐదు వేలు పైచిలుకు జనాభా అని చెప్తున్నా పలు కారణాలు ఉన్నాయని చెప్పవచ్చు. దీంట్లో మరొక కారణం మూలపేట పోర్టు నిర్మాణం. కీలకమైన ప్రాజెక్టుకు సమీపంలోనే ఉన్న పంచాయతీ కావడం, మరోవైపు నిర్వాసితులకు కేటాయించిన ఆర్అండ్ఆర్ కాలనీ కూడా ఈ పంచాయతీకి ఆనుకునే ఉండడం వంటివి. దీంతో పని ఒత్తిడి ఎక్కువగా ఉద్యోగుల్లో ఒక అపోహ ఉంది. అలాగే స్థానిక రాజకీయ పరిస్థితులు పార్టీల్లో గ్రూపుల గోల, రాజకీయ ఒత్తిడి లాంటి కారణాలు చెప్తున్నారు. మరోవైపు మీడియా ప్రతినిధులుగా గ్రామంలో ఎక్కువ మంది పని చేస్తుండడం వారిని ఎదుర్కోవడం కష్టతరం అవుతుందని కొంతమంది ఉద్యోగులు ఆఫ్ ది రికార్డుగా చెబుతున్నారు. ప్రతి చిన్న విషయాన్నీ భూతద్దంలో చూపుతున్నారని సన్నిహితులు వద్ద ప్రస్తావిస్తున్నారు. ఇప్పటికే శాశ్వత ప్రాతిపదికన అధికారులు నియామకం లేక ఇన్‌ఛార్జీలతో కాలం గడపాల్సిన పరిస్థితి పంచాయతీలో ఏర్పడింది. ఉద్యోగుల్లోని ఈ రకమైన అపోహలు తొలగించేందుకు ఏ అధికారి కానీ, నాయకులు కానీ చొరవ చూపడం లేదు. వాస్తవానికి ఈ అపోహ సచివాలయ వ్యవస్థ రాక ముందు నుంచీ ఉంది. ఇప్పటివరకు చాలామంది అధికారులు పనిచేసే మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అలాగే నౌపడలో అధికారులకు ప్రజల నుంచి గౌరవం, సహకారం ఎప్పుడూ అందుతుంటాయి. ఎక్కువమంది నిరుపేద ప్రజలు, ఉప్పు కార్మికులు, రైతులు ఉంటారు. నౌపడలో పనిచేయలేం అన్న విషయం మైండ్ గేమా? ఎక్కడి నుంచి పుట్టుకువచ్చిందో తెలియడం లేదని పలువురు గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయంపై మీడియా ప్రతినిధులు గాని, రాజకీయ నాయకులు గాని అధికారులకు సరైన అవగాహన కల్పించి అపోహ తొలగించాల్సిందిగా అవసరం ఉంది. ఇప్పటికైనా విధి నిర్వహణలో ఉద్యోగులకు పూర్తి సహాయ సహకారాలు అందించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని వ్యక్తులను ప్రజలు వేడుకుంటున్నారు.

కృష్ణదాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు

టెక్కలి రూరల్ : పోలాకి మండలం మబగాం క్యాంపు కార్యాలయంలో వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌కు జెడ్‌పిటిసి దువ్వాడ వాణి ఆదివారం ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణదాస్‌తో కేక్ కట్ చేయించి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సన్మానించారు. వైసిపి పూర్వ వైభవానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కృష్ణదాస్ కోరారు. కార్యక్రమంలో ఎంపిపి అట్లా సరోజనమ్మ, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

కళలను ఆదరించి కళాకారులను ఆదుకోవాలని కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బగాది తేజేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పేడాడ ధనుంజయరావు ఆధ్వర్యంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి బగాది తేజేశ్వరరావు మాట్లాడుతూ కళలను ప్రోత్సహిస్తూ కళాకారులకు అండగా నిలవాలని అన్నారు. అనంతరం సంఘ సహాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్దనరావు మాట్లాడుతూ కళా ప్రదర్శనల ద్వారా సమాజ చైతన్యం కలుగుతుందన్నారు. ప్రజలు ప్రభుత్వాలు కళలను ప్రోత్సహించి కళలను బతికించాలన్నారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు దాస్యం లక్ష్మణరావు, అలజంగి రామాచారి, కోశాధికారి కొంచాడ రామారావు, కార్యదర్శులు నాయన పాత్రుని వాసుదేవరావు, కుంచాల భాస్కరరావు, బెండి గోవిందరావు, కార్యవర్గ సభ్యులు లోలుగు విశ్వేశ్వరరావు, తమ్మినేని సూర్యనారాయణ, బొక్కిన దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పిటెల్ పోటీలో 'ఐతమ్'కు 200 ర్యాంకు

టెక్కలి రూరల్: చెన్నై ఐఐటిలో నిర్వహించిన ఎన్‌పిటెల్ పోటీలో ఐతమ్ కళాశాల 200వ ర్యాంకు సాధించిదని డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ పరీక్ష ఎన్‌పిటెల్‌లో అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన పరీక్షకు, దేశ వ్యాప్తంగా మొత్తం 3,712 ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని అన్నారు. ఆ పరీక్షలో టెక్కలిలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల 200వ ర్యాంకులో నిలిచిందని తెలిపారు. ఎన్‌పిటెల్ స్పోక్ ఐతం కళాశాల ఆచార్యులు డాక్టర్ డి.యుగంధర్, అసోసియేట్ డీన్ ఈ నెల 5న కో-ఆర్డినేటర్ ఆంధ్రూ తంగరాజ్ చేతులు మీదుగా ఈ ర్యాంకింగ్ ధ్రువపత్రాన్ని ప్రదానం చేశారని అన్నారు. ఈ ప్రశంసపత్రం ఐతం కళాశాలకు లభ్యం కావడంతో డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, బోధనా బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



చెక్కును అందజేస్తున్న మాజీ ఎంపిపి ప్రమీల

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

పొందూరు: మండలం వి.ఆర్.గూడెం గ్రామానికి చెందిన సువ్వారి శ్రీనివాసరావుకు రూ.1.08 లక్షల సిఎం సహాయనిధి చెక్కును ఆదివారం ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల అందజేశారు. ఇటీవల శ్రీనివాసరావు మోకాలికి శస్త్రచికిత్స నిర్వహించగా ఈ విషయాన్ని ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి సిఎం సహాయనిధి ద్వారా ఆపరేషన్‌కు అయిన ఖర్చును అందజేశారు. దీంతో సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందజేయడంతో బాధితుడితో పాటు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సువ్వారి మధుసూదనరావు, ఉప సర్పంచ్ ప్రతినిధి సువ్వారి గోవిందరావు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళి

శ్రీకాకుళం సిటీ: భారత ప్రభుత్వం యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్, జాతీయ సేవాపథకం యూనిట్, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ పురుషుల కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి ఆదివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.ఖరాములు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఒక ప్రముఖ భారతీయ విద్యావేత్త, న్యాయవాది, ఆదర్శ రాజకీయ నాయకుడని అన్నారు. యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్, అధ్యాపకులు బి.వరలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్.శ్రీనివాస్ పాత్రో పాల్గొన్నారు.

ప్రాణాలు పోయినా భూములు వదిలేది లేదు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అన్నంపేట పంచాయతీ పరిధిలో డి పట్టాదారులైన దళితులు, ఇతర పేదలతో నిర్వహించిన సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాపు సింహాచలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నంపేటలోని దళితులకు ప్రభుత్వం డి పట్టా ద్వారా ఇచ్చిన భూముల్లో 50 ఏళ్లుగా, అలాగే ఇతర బలహీన వర్గాల పేదలు 75 ఏళ్లుగా సాగు చేస్తున్న భూములపై తప్పుడు హక్కుపత్రాలు తయారు చేసుకుని కోర్టుల్లో కేసులు వేయడం అన్యాయమన్నారు. మంగపల్లి సూర్యప్రకాశరావు అనే వ్యక్తి ఈ జిల్లా వాసికాదని, విశాఖపట్నం నుంచి వచ్చి ఇక్కడి దళిత పేదలను వేధించడం అన్యాయమని పేర్కొన్నారు. మా ప్రాణాలు పోయినా పరవాలేదు కానీ ఎన్నోఏళ్లుగా సాగు చేస్తున్న భూములు వదిలే ప్రసక్తే లేదని అక్కడి దళితులు తెగేసి చెప్పారని ఆయన తెలిపారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో దళితులు, ఇతర పేదలకు ఇచ్చిన డి పట్టా భూములు దశాబ్దాలుగా సాగులో ఉన్నా, కొందరు



మాట్లాడుతున్న సింహాచలం

పెత్తందారులు వాటిపై హక్కుపత్రాలు చూపుతూ హక్కు వాదనలు చేయడం వెనుక ఎవరి మద్దతు ఉందో ప్రభుత్వ యంత్రాంగం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రెవెన్యూ యంత్రాంగం, జిల్లా ఉన్నతాధికారులు ఈ భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టకపోతే దళితులు, పేదలు తీవ్ర అన్యాయానికి గురవుతారన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన డి పట్టాలను కాపాడే బాధ్యత అధికారులదేనని, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.



మెళియాపుట్టి : సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

సమ్మెను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 9న అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, వ్యవసాయ కార్మిక కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు పిలుపునిచ్చారు. మండలంలోని చాపర సిఐటియు కార్యాలయంలో సమ్మె సన్నాహక మండల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9న సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొని పాల్గొవాలన్నారు. అశేష త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసిన కేంద్ర బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందన్నారు. అంగన్వాడీ, ఆశ తదితర స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్ కె.నారాయణమ్మ, మజ్జు, మంగమ్మ, స్వర్ణలత, శోభారాణి, పద్మ, విజయలక్ష్మి, దారపు దామోదర్, ఉమామహేష్, సింహాచలం, రామారావు పాల్గొన్నారు.

పలాస : ఈ నెల 9న నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పుచ్చ దుర్యోధన పిలుపునిచ్చారు. మండలంలోని బొడ్డపాడులో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కొండారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మద్దిల ధర్మారావు, డి.నారాయణమూర్తి, కె.పురుషోత్తం, మామిడి గణపతి, గర్తం కూర్మారావు, జోగారావు, గూడ మన్మథ పాల్గొన్నారు.

పశువుల దాణా అందజేత

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వం 50శాతం రాయితీతో పశువుల దాణాను రైతులకు అందజేస్తుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పురపాలక సంఘం పరిధిలోని 15వ వార్డు ప్రాతినవారివీధిలో ఉన్న పశువైద్య కేంద్రంలో ఎమ్మెల్యే రైతులకు పశువుల దాణాను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్య అసిస్టెంట్ డైరెక్టర్ జి.నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ జోనోసిస్ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. విశ్వాసం గల కుక్కలను, గోవులను, ఇతర జంతువులను అమితంగా ప్రేమిస్తున్న ఈ రోజుల్లో వాటి నుంచి వ్యాపించే అంటువ్యాధులపై కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పశువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధుల్లో రేబిస్ అత్యంత ప్రమాదకరమైన ప్రాణాంతకమైన వ్యాధి అని అన్నారు. పిచ్చికుక్క కాటుకు గురైన వ్యక్తికి లూయి ఫ్రాక్చర్ అనే శాస్త్రవేత్త 1885 జూలై 6న మొట్టమొదటిసారిగా యాంటీ రేపిస్ట్‌ను కనుగొనడం జరిగిందన్నారు. ఆయనను



పశుదాణాను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

స్మరిస్తూ ప్రతి ఏడాది జులై 6న ప్రపంచ జోనోసిస్ దినోత్సవం జరుపుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జంతువులకు అవసరమైన వ్యాక్సిన్‌లు ఉచితంగా సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ సుధాకర్, టిడిపి నాయకులు ఎస్.మురళీధర్, కె.ఆంజనేయులు, ఎ.సత్యనారాయణ, భాస్కరరావు, మురళీధర్ యాదవ్, పాతిన రమణమూర్తి, పశువైద్యాధికారులు జోత్స్న, స్వర్ణ, కీర్తి తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా జగ్జీవన్ రామ్ వర్ధంతి

శ్రీకాకుళం సిటీ: మాజీ ఉప ప్రధాని, స్వతంత్ర సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకొని డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులు నగరంలో ఆదివారం విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల కోసం, సామాజిక వివక్షతను రూపుమాపేందుకు అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు కెవిఎల్ఎస్ ఈశ్వరి, నాయకులు ఇజ్జురోతు రమణ, సాయి దుల్లా ఖాన్, తెంబూరు మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో...

బాబు జగజ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలో వైసిపి నాయకులు విగ్రహానికి ఆదివారం నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నాయకులు పొన్నాడ ఋషి, అందవరపు సూరిబాబు, వైసిపి పట్టణ అధ్యక్షులు సాదు వైకుంఠరావు పాల్గొన్నారు.

9న 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ కెవిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 9న బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని వైసిపి పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి పిలుపునిచ్చారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో పర్యటించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి వైసిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, రెండో వార్డు కౌన్సిలర్ ప్రతినిధి బడగల బల్లయ్య, పట్టణ ఉపాధ్యక్షులు నర్తు వెంకటరమణ, యూత్ అధ్యక్షులు పోతానపల్లి హరిప్రసాద్, కో- ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌కుమార్, దున్న సత్యం, బోర చంద్రకళ, బోర భగవతిరెడ్డి, జోగి సతీష్, పట్టణ ప్రధాన కార్యదర్శి బిరాటి వల్లభరావు, వల్లభ వైకుంఠరావు, కింతల శివయ్య మాస్టర్, కింతల కిషోర్, యూత్ నాయకులు తలగాన కిషోర్, తామాడ సంతోష్, దున్న చంటి పాల్గొన్నారు.

గ్రామస్తుల నడక యాతన

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని నౌపడలో ఉన్న టెక్కలివీధిలో సక్రమంగా రోడ్లు లేక నడవడానికి గ్రామస్తులు యాతన పడుతున్నారు. టెక్కలివీధి నుంచి ఆరో ఫారం దగ్గర శ్మశానం వరకు గత ప్రభుత్వ హయాంలో ఉపాధిహామీ నిధులతో గ్రావెల్ రోడ్డు నిర్మించారు. గ్రావెల్‌రోడ్ వేసినా నాణ్యత లేక పోవడంతో పూర్తిగా గోతులమయంగా తయారైంది. దీంతో వర్షాకాలం రోడ్డుపై వెళ్లేందుకు వీలులేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. అడుగు తీసి అడుగు వెయ్యాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఇక వాహనాలు అంటే ఒక్క అడుగు కూడా ముందుకు సాగవు. పంచాయతీలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీకి వెళ్లేందుకు ఇదే మార్గం. గ్రామానికి ప్రధాన శ్మశానం ఈ మార్గం గుండానే వెళ్లాలి. దీంతో గ్రామస్తులకు అంత్యక్రియలకు వెళ్లాలన్నా అవస్థలు తప్పడం లేదు. పలుమార్లు గ్రామసభలో సిసి రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు



బురదమయంగా రోడ్డు

ఆచరణకు నోచుకోలేదు. ఈ దీంతో త్వరితగతిన రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ అనంత్ దృష్టికి తీసుకెళ్లగా, ఈఏడాది (2025-26)లో సిసి రోడ్డు నిర్మాణానికి 100 మీటర్లు దూరానికి సేఫ్టీవాల్‌తో కలిపి రూ.15 లక్షలు నిధులను అంచనా వేశారన్నారు. దీన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసి నిర్మాణం పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు. వర్షాకాలం కావడంతో నిర్మాణానికి చర్యలు వేగవంతం చేస్తామని తెలిపారు.

జంతువులను ప్రేమిద్దాం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా టెక్కలి డివిజన్ ఉప సంచాలకులు చందక నర్సింహులు ఆధ్వర్యాన టెక్కలి పశువైద్యశాల ప్రాంగణంలో ఆదివారం అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. జిల్లా పశువుల ఆస్పత్రి వైద్యులు బి.లక్ష్మణరావు, ఎడి బి.వి.రమణ పాల్గొని జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులు, నివారణ చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.పూర్ణచంద్రరావు, టిడిపి మండల అధ్యక్షులు బగాదిశేషగిరిరావు, టెక్కలి పట్టణ అధ్యక్షుడు కోళ్ల లవకుమార్, రమణ పాల్గొన్నారు.

పలాస : స్థానిక ఉల్లాసపేటలోని ప్రభుత్వ వైద్యశాలలో 47 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మట్ట రవికృష్ణ, డాక్టర్ పి.చంద్రశేఖర్‌లు వేశారు. ముందుగా ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి పశువుల ఆస్పత్రిలో 76 పెంపుడు కుక్కలకు పశు సహాయ సంచాలకులు డాక్టర్ మందా లోకనాథం జూనోటిక్ వ్యాధి నివారణ టీకాలను వేశారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్, సిబ్బంది ధర్మారావు పాల్గొన్నారు.



కోటబొమ్మాళి : కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యాధికారులు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని రాంపురం పంచాయతీ జయపురానికి చెందిన వివాహిత రాంపురం రత్నాలమ్మ (54) ఆదివారం వేకువజామున తన ఇంట్లో గడ్డి మందు తాగి తాగింది. దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు టెక్కలిలోనే జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడింది. రెండు నెలలుగా పూర్తిగా కళ్లు కనిపించకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి భర్త మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎఎస్ఐ కె.జెన్నారావు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- రణస్థలం

జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 16వ నెంబర్ జాతీయ రహదారిపై పిసిని గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పైడిభీమవరం పంచాయతీ లోడగలపేటకు చెందిన లోడగల తవుడు (70) మృతి చెందారు. వివరాల్లోనికి వెళ్తే మతిస్థిమితం లేక శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చేసారు. ఎక్కడకి వెళ్లాడోనని కుటుంబ సభ్యులు వెతకగా ఆదివారం ఉదయం రోడ్డుపై మృతి చెంది ఉన్నాడు. స్థానిక జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్‌లో మృతుని కుమారుడు తాతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం ప్రభుత్వాసుపత్రికి తరలించారు

పరామర్శ

లావేరు: మండలంలో పలు పరామర్శ కార్యక్రమాల్లో వైసిపి నాయకులు పిన్నింటి సాయి కుమార్ పాల్గొన్నారు. ఆదివారం బొంతుపేటలో వైసిపి కార్యకర్త తాడేల రామకృష్ణ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే అదే గ్రామానికి చెందిన బొంతు వెంకటరావు భార్య అనారోగ్యంతో బాధపడటంతో వారిని పరమర్శించారు. ఈయనతో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్లా వెంకట్ రెడ్డి, సర్పంచ్ మీసాల రామినాయుడు, గొర్లె రమణ, సూర్యనారాయణ తదితరులున్నారు.

పట్టణంలో కార్డాన్‌సెర్చ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అసాంఘిక కార్యకలాపాలు అరికట్టే దిశగా 1వ పట్టణ పోలీస్‌స్టేషన్ పోలీసులు తమ పరిధిలోని కార్డాన్‌సెర్చ్ ఆదివారం నిర్వహించారు. నేర నియంత్రణ, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అరికట్టే చర్యల్లో భాగంగా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ హరికృష్ణ, సిబ్బంది పట్టణ పరిధిలో రాజీవ్ గృహకాలనీలోని తెల్లవారు జామున కార్డాన్‌సెర్చ్ నిర్వహించి ఇళ్లు, పాన్‌షాపులు తదితర దుకాణాల్లో విస్తృతంగా తనిఖీ చేశారు. గంజాయి, మద్యం, నాటుసారా, నిషేధిత పదార్థాలు, అక్రమ నిల్వలపై సోదాలు చేసి అపరిచిత, అనుమానిత వ్యక్తులను గుర్తించేందుకు ఆకస్మిక తనిఖీలను చేపట్టారు. అనుమానిత వ్యక్తులను విచారించి, పాత నేరస్తుల ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా అనధికార, సరైన వాహనపత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసు కున్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం

తపాలా ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం: పట్టణంలోని శ్రీఫంక్షన్ హాల్‌లో ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్, శ్రీకాకుళం డివిజన్ ద్వైవార్షిక మహాసభలు రాష్ట్ర నాయకులు, డివిజనల్ అధికారుల పర్యవేక్షణలో జరిగాయి. ఈ మహాసభలో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న తపాలా ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా శ్రీకాకుళం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు, రాష్ట్ర నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎస్.కె.జమాల్ బాషా, వై.స్పర్జన్ రాజు, మాజీ రాష్ట్ర కార్యదర్శి వై.మర్రెడ్డి హాజరయ్యారు. 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా రాబోయే రెండేళ్ల కాలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బి.అప్పారావు, ఎన్.నందికేశ్వరరావు, కోశాధికారిగా పి.రామకోటేశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



పుష్-కార్ట్స్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

చెత్త సేకరణకు పుష్-కార్ట్స్ సిద్ధం

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో పారిశుధ్యం మెరుగుపర్చడంలో భాగంగా ఇంటింటా చెత్త సేకరణకు పుష్-కార్ట్స్ సిద్ధం చేస్తున్నట్లు కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. పలాసలో ఇంటింటా చెత్త సేకరణ కోసం తయారు చేస్తున్న పుష్-కార్ట్స్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాటాడుతూ చెత్త సేకరణకు పూర్తి స్థాయిలో వాహనాలు లేకపోవడంతో పారిశుధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే గౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ఆదేశాల మేరకు నూతనంగా తయారు చేస్తున్న పుష్-కార్ట్స్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వీటి ద్వారా కొంతమేర పారిశుధ్యం మెరుగుపడుతుందని చెప్పారు. స్వీయ పర్యవేక్షణలో తయారు చేయిస్తున్నట్టు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

వజ్రపుకొత్తూరు: రైలు ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన దున్నకృష్ణయ్యగారి అప్పారావు కుటుంబానికి యువతరం సేవా సమితి ఆదివారం ఆర్థికసాయం అందించారు. మండలంలోని అమలపాడులో మృతుని భార్య సంధ్య, పిల్లలను కలసి రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. గత నెల 7న బతుకుతెరువు కోసం చెన్నయ్ వెళ్లేందుకు రైలు ఎక్కుతుండగా... జారిపడి మృతి చెందారు. కార్యక్రమంలో యువతరం సేవా సమితి అధ్యక్షులు చింత మురళి, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి గోరకల సునీల్, ఇన్‌ఛార్జీలు అన్నెపు లక్ష్మణరావు, సైనీ లోకేష్, గున్న వెంకటరమణ, గర్తం పుష్ప, రవి, దున్న పెంటరావు, తామడ వీరస్వామి, బచ్చల రాజు, దున్న లక్ష్మణ్ పాల్గొన్నారు.

పేదల జీవన ప్రమాణాల మెరుగుకు కృషి


కొత్తూరు : పోస్టర్‌ను అందజేస్తున్న వెంకటరమణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పేదల జీవన ప్రమాణాల మెరుగుకు సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పురపాలక సంఘంలోని 20వ వార్డు వెంగళరావు కాలనీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా వార్డులో ఏర్పాటు చేసిన టిడిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై మహిళలను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక లోపాల కారణంగా సంక్షేమ పథకాల అమలులో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పలువురు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీత, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, రెడ్డి రాంబాబు, ఎస్.మురళీధరరావు, నాగళ్ల మురళీధర్ యాదవ్, సునీత, రాజ్యలక్ష్మి, జీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని తామాడలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి గొర్లె శ్రీనువాసరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పిన్నింటి మధుబాబు, బిసి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, బుడతవలస ఎంపిటిసి ముల్లు సాయికుమార్, మోడల్ స్కూల్ ఛైర్మన్ రామారావు, ఎస్ఎంసి ఛైర్మన్ చిన్న చిన్నారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని మాతలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న, చేయనున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కుద్దిగాం సర్పంచ్ నెల్లి అచ్యుతరావు, జి.తేజేశ్వరరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలం కురుడు పంచాయతీ చౌదరి కొత్తూరులో స్థానిక టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.


లావేరు : పోస్టర్లను పంపిణీ చేస్తున్న నాయకులు

కార్యక్రమంలో నాయకులు చిన్ని, గంగు సుందర్శన్, బోర నాగభూషన్, అప్పారావు, నీలయ్య, రాములు, సింహాచలం, మల్లేసు, రాంబాబు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని కొఠారి, తులసిగాం పంచాయతీల్లో టిడిపి మండల అధ్యక్షులు ఎల్.పద్మనాభం తొలి అడుగులో కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డిల్లీరావు, సాడి సహదేవ్‌రెడ్డి, దక్కత కామేశ్వరరావు, మాధవరావు, పెద్దిన దుర్యోధనరెడ్డి, పెద్దినా బాబ్జీ, హేమరాజు, ఇసురు సారథి, బోర ప్రసాద్, పరశురాం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న రచయితలు

'తెప్పల'కు సత్కారం

పలాస : శ్రీకాకుళం శాంతినికేతన్ కళాశాలలో ఆదివారం తెలుగు రచయిత వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవి, రచయిత, కళాకారుడు, పలాస జనజాగృతి వ్యవస్థాపకులు, లయన్స్ అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తిని దుశ్శాలువ కప్పి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి, డాక్టర్ నిక్కు అప్పన్న, సంస్థ కార్యవర్గ సభ్యులు, విశ్రాంత డిఇఒ బలివాడ మల్లేశ్వరరావు, డాక్టర్ బారువ కోమలిరావు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పట్టణంలోని 80 అడుగుల రోడ్డులో ఆదివారం వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం అధ్యక్షులు వడ్డీ మన్మధరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో 2025- 26 సంవత్సరానికి నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా కె.వి రమణ, కార్యదర్శిగా కోరాడ భుజంగరావు, కోశాధికారిగా పి.గోవిందరావు, వైస్ ప్రెసిడెంట్ దేవరకొండ శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా డి.గిరిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన కెవి రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యం కొరకు శ్రద్ధ వహిస్తూ జీవనశైలిలో మార్పు చేసుకుంటూ ప్రతినిత్యం నడక తప్పనిసరి చేయాలన్నారు. నడకవల్ల వచ్చే లాభాలను మరింత మందికి తెలిసేలా అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో ఆర్.కె.నాయుడు, వడ్డీ కామేశ్వరరావు, వి తిరుమల రాజు, పి.శ్రీనివాసరావు, డి.శివశంకర్, ఎంఆర్‌కె దాస్, పి.మధుసూదన గుప్తా, మాధవరావు, వాకర్స్ పాల్గొన్నారు.


రాజారావు మాస్టార్‌ను సన్మానిస్తున్న తెరవే సభ్యులు

రాజారావు మాస్టారుకు తెరవే సత్కారం

పొందూరు: మండలంలోని వావిలపల్లిపేటకు చెందిన రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత, ఉపాధ్యాయుడు వావిలపల్లి రాజారావును ఆదివారం శ్రీకాకుళంలోని తెలుగు రచయితల వేదిక (తెరవే) ఘనంగా సత్కరించింది. శాంతినికేతన్ కళాశాలలో తెరవే నిర్వహించిన 106వ నెలవారీ సాహితీ కార్యక్రమంలో ఈయనకు విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి బలివాడ మల్లేశ్వరరావు దుశ్శాలువ కప్పి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో తెరవే అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కోమలరావు తదితరులున్నారు.

నీలకంఠంకు నివాళి

పలాస: సుదీర్ఘ రాజకీయ ప్రయాణం సాగించిన పలాస మాజీ సర్పంచ్, టిడిపి నాయకుడు కొల్లకోట నీలకంఠం ఆకస్మిక మృతి తీవ్ర ఆవేదనకు లోనుచేసిందని ఎపిటిపిసి ఛైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. పలాసలో ఆదివారం నిర్వహించిన సంస్మరణ సభలో పాల్గొని మాట్లాడారు. నీలకంఠం ఆశయాలు అనుసరణీయమన్నారు. అంతకు ముందు నీలకంఠం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నీలకంఠం సతీమణి లక్ష్మి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, నాయకులు గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, లొడగల కామేశ్వరరావు, అంబటి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎన్‌ఇఆర్ ముందస్తు జన్మదిన వేడుకలు

రణస్థలం రూరల్: మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ముందస్తు జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వహించారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడు, నాలుగు మండలాల టిడిపి అధ్యక్షులు ముప్పిడి సురేష్, బెండు మల్లేశ్వరరావు, లంక శ్యాం, కుమారావు రవికుమార్, పిసిని జగన్నాధం నాయుడు, బాలి శ్రీను, రౌతు శ్రీనివాసరావు, మునకాల రామిరెడ్డి, వాళ్లే రమణ, మజ్జి వెంకటరమణ, కలిశెట్టి రామారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

'రోటరీ' సేవల విస్తరణే లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రోటరీ సేవలు మరింత విస్తరణే లక్ష్యమని రోటరీ జిల్లా పూర్వ గవర్నర్ జి.విశ్వనాథ్ అన్నారు. స్థానిక వారాహి గ్రాండ్ ఫంక్షన్ హాల్లో ఆదివారం రోటరీ క్లబ్ శ్రీకాకుళం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. కార్యక్రమానికి ఇనిస్టలేషన్ ఆఫీసర్‌గా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రోటరీ సేవలు మరింత విస్తృతం చేయాలని, శాశ్వత ప్రాజెక్టులు చేపట్టాలని కోరారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీకాకుళం డిఎస్‌పి వివేకానంద మాట్లాడుతూ రోటరీ అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ప్రశంసనీయమని అన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు



మెమెంటోలతో నూతన కార్యవర్గ సభ్యులు

చేపట్టాలని ఆకాంక్షించారు. రోటరీక్లబ్ శ్రీకాకుళం 2025- 26 నూతన కార్యవర్గం ఎన్నిక ముని శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా బరాటం శ్రీనివాస్, కార్యదర్శిగా కిల్లన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా డా. బమ్మిడి సందీప్, కోశాధికారిగా కందుల నవీన్ కుమార్ ఎన్నికయ్యారు.

ఇచ్ఛాపురంలో ఫిట్‌నెస్ కార్యాలయం ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న వామనమూర్తి

ఇచ్ఛాపురం : వాహనదారులకు 60 కిలో మీటర్ల లోపల ఫిట్‌నెస్ చేసేలా కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వామనమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక ఆటో యూనియన్ కార్యాలయం వద్ద ఆదివారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకు శివారున ఉన్న ఇచ్ఛాపురం నుంచి ఎచ్చెర్ల వరకు 140 కిలో మీటర్ల దూరంలో వెళ్లి వాహనాలు ఫిట్‌నెస్ చేసుకోవడం వల్ల అనేక ఇబ్బందులు ఉన్నాయని అన్నారు. ఆటో వాహనదారులకు అనుకూలంగా ఉండే ఇచ్ఛాపురంలో ఫిట్‌నెస్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు బడే మోహన్, పి.హరి, తిరుమల, ఉపాసి, ఎర్రయ్య, దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.


నగదును అందజేస్తున్న రామ్మూర్తి తదితరులు

మంగమ్మ కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- లావేరు

మంగమ్మ కుటుంబానికి తాను అండగా ఉండి ఆదుకుంటానని గుమ్మడాం టిడిపి నాయకులు రామ్మూర్తి అన్నారు. గుమ్మడాం పంచాయతీ వాళ్లేపేటలో ఇటీవల గొర్లె మంగమ్మ అకాల మరణం చెందడంతో ఆదివారం ఆకుటుంబానికి రామ్మూర్తి కొంత నగదు, నిత్యావసర సరుకులు అందజేసి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు పిలుపుమేరకు తన సంపాదనలో కొంతమేర పేద కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ప్రతినెల రెండు కుటుంబాలకు నెలకు సరిపడే 22 రకాల చంద్రన్న నిత్యావసర సరుకుల కిట్లు అందజేస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో వెంకటరమణ, గొర్లె భువనేశ్వర్, రౌతు అప్పల నాయుడు, మురళీ, రామినాయుడు, పైడితల్లి తదితరులున్నారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిటిఎఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, ఉమ్మడి జిల్లా పూర్వ అధ్యక్షులు కొమ్ము అప్పలరాజు డిమాండ్ చేశారు. రైతుబజార్ జంక్షన్‌లోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాలలు పున ప్రారంభమైనప్పటి నుంచి అనవసరమైన విద్యార్థులకు ఉపయోగపడని కార్యక్రమాలతో ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. యోగా దినోత్సవం, మెగా పేరెంట్స్ సమావేశం వంటివి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల కోసం విద్యార్థుల, తల్లిదండ్రుల జీవితాలతో చెలగాటం


మాట్లాడుతున్న హరిప్రసన్న

ఆడుతున్నారని విమర్శించారు. ఉపాధ్యాయులకు న్యాయ బద్ధంగా రావాల్సిన బకాయిలు చెల్లించకుండా అవసరమైన కార్యక్రమాలతో బోధనకు ఆటంకం కలిగిస్తున్నారన్నారు. పదో తరగతి పరీక్షల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు, పదో తరగతి మూల్యాంకనంలో పాల్గొన్న ఛీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లకు ఇంతవరకు రెన్యుమరేషన్ చెల్లించకపోవడం బాధాకరమన్నారు. డిఎలు విడుదల చేయకుండా, పిఆర్‌సి కమిటీ ఏర్పాటు చేయకుండా అనవసర కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో డిటిఎఫ్ జిల్లా బాధ్యులు గురుగుబెల్లి రాజశేఖర్, ఎన్ని ప్రసాద్, గణేష్ పాల్గొన్నారు.

ఘనంగా మొహరం

ఇచ్ఛాపురం: పట్టణంలోని కస్పా మసీదుకు సమీపంలో ఉన్న మౌలాలి పంజా వద్ద ముస్లిములు ఆదివారం ఘనంగా మొహరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్ద జోహర్‌ఖాన్ మాట్లాడుతూ హజ్రత్ ఇమామ్ హుస్సేన్ తన నీతిపై నిబద్ధతను తెలియజేసి, కష్టాల సమయంలో సత్యాన్ని నిలబెట్టడానికి ప్రజలకు స్ఫూర్తినిచ్చారని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అబ్దుల్లా, అమీర్‌అలీ, మున్నా, బషీర్, జుల్లు ఆలీ బక్రీ, యూసఫ్ ఖాన్ పాల్గొన్నారు.